విజ్ఞానం పంచిన శిక్షణ శిబిరాలు

- విద్యార్థుల్లో సృజనకు మరిన్ని మెరుగులు
- వేసవి విజ్ఞాన శిబిరాలపై తల్లిదండ్రుల హర్షం
- ముగింపు వేడుకలో బహుమతులు, జ్ఞాపికల ప్రదానం

గాజువాక : విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన విజ్ఞాన శిబిరాలు వారికి ఎంతో మేలు చేకూర్చాయని అతిథులు కొనియాడారు. విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. గత నెల 16న ప్రారంభమైన శిబిరాలు శుక్రవారంతో ముగిసిన సందర్భంగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

- గాజువాక గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ శిబిరంలో నిర్వహించిన వివిధ ఆటలు, పాటలు, వ్యాసరచన తదితర పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా బహుమతులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథి తుంపాల శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చదువు, ఆటలు, పాటలతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. జీవితంలో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. విజయం వచ్చినప్పుడు అత్యుత్సాహం, అపజయం వచ్చినప్పుడు నైరాశ్యం ఆవహించకుండా చూసుకోవాలన్నారు. చేతిరాతను ప్రతి ఒక్కరూ మెరుగుపర్చుకోవాలని, పెద్దల పట్ల క్రమశిక్షణతో మెలగాలని, తల్లిదండ్రులను గౌరవించాలని, ఎల్లప్పుడూ నిజాయితీగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపికలతో చిన్నారులు

ప్రతిభను వెలికి తీసే అవకాశం

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిబిరాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే అవకాశం ఉంటుందని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయన్నారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో 24 రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు బహుమతులు ప్రదానం జేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు కాలాన్ని వృథా చేయకుండా వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఆయా అంశాల్లో పోటీలను నిర్వహించి బహుమతులు అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీ రమణ, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.





చిన్నారులకు బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్, హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్, పాల్గొన్న చిన్నారులు

గీత దాటితే వేటే..

అనధికార పార్కింగ్‌పై పోలీసుల కన్నెర్ర

గాజువాక : ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలకు గాజువాక పోలీసులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. తొలుత అనధికార పార్కింగ్‌పై కన్నెర్రజేశారు. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టే చర్యల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు ఇటీవల ట్రాఫిక్ స్టైచ్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటివరకు ప్రచారం చేసిన పోలీసులు అనధికార పార్కింగ్‌లపై చర్యలకు దిగారు. అందులో భాగంగా పాత గాజువాకలో అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలకు తాళం వేశారు. గాజువాక మెయిన్ రోడ్‌లోని రద్దీ ప్రాంతంలో రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలకు స్వాధీనం చేసుకున్నారు. తమ ద్విచక్ర వాహనాన్ని ఇష్టం వచ్చినట్టు పార్క్ చేసి, తరువాత తీరిగ్గా వచ్చిన యజమానులకు కొంతసేపు హితోపదేశం చేసిన పోలీసులు ఇది పునరావృతమైనతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరాధ రుసుం కూడా భారీ మొత్తంలో ఉంటుందని పేర్కొన్నారు.



ద్విచక్ర వాహనానికి తాళం వేస్తున్న పోలీసులు

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులతో వాసవీ క్లబ్ ప్రతినిధులు

టెన్త్, ఇంటర్‌లో టాపర్లకు వాసవీ క్లబ్ బహూకరణ

అగనంపూడి: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి, ప్రథమంలో నిలిచిన విద్యార్థులకు వాసవీ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ ఉడా సత్యనారాయణ (మయూరి బుజ్జి) నగదు పారితోషికాలు అందించారు. మయూరి బుజ్జి కుమారుడు చిరంజీవి అశ్వంత్ పాపారావు 24వ జయంతిని పురస్కరించుకుని అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో టాపర్లుగా నిలిచిన ఆరుగురు విద్యార్థులతో పాటు సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల్లో ప్రథమ ర్యాంక్ (493) సాధించిన నిరుపేద వైశ్య కుటుంబానికి చెందిన హర్షవర్ధన్‌కు మొత్తం ఏడుగురికి రూ.2వేల వంతున నగదు అందించారు. అలాగే కార్యక్రమంలో పాల్గొన్న 50 మంది విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, నోట్ పుస్తకాలు అందించారు. అనంతరం నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ వై.నరసింగరావు మాట్లాడుతూ వాసవీ క్లబ్ అగనంపూడి ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గణేష్, గురుమూర్తి, సత్తిబాబు, రామకృష్ణ, వరలక్ష్మి, గున్నయ్య శెట్టి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

1212వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్ష శిబిరంలో 1212వ రోజు, శుక్రవారం పాల్గొన్న నాయకులు మొదలవలస వెంకటరమణ, పెదిరెడ్ల నీలకంఠం మాట్లాడుతూ విశాఖ ఉక్కును పరిరక్షించుకునేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు. విశాఖ ఉక్కును కాపాడే శక్తి ప్రస్తుతం మన రాష్ట్ర కూటమి నాయకుల చేతుల్లో ఉందని, ఈ విషయంలో చొరవ తీసుకుని పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించడం, సెయిల్‌లో విలీనం చేయడం వల్ల పూర్వ వైభవానికి ఊతమివ్వాలని కోరారు. కార్యక్రమంలో హరనాథ్, సత్యనారాయణ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు.

దోమల నిర్మూలనతో వ్యాధులకు చెక్



దొండపర్తిలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డులో గల దొండపర్తి పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మలేరియా అవగాహన మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రావణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం పైబడి నీటి నిల్వలుంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. దీనికి ప్రజల సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ ఎల్.శ్రీను, జీవీఎంసీ మలేరియా హెల్త్ అసిస్టెంట్ శివ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవిద్య కోర్సు ప్రారంభం



కోర్సు నేర్చుకునేందుకు వచ్చిన విద్యార్థులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీ దేవి పీఠంలో శ్రీవిద్య కోర్సును శుక్రవారం ప్రారంభించారు. తెలుగు భాషలో ఈ నెల 7వ తేదీ నుంచి 10 తేదీ వరకూ నాలుగు రోజుల పాటు ఈ కోర్సు నేర్పించనున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తెలుగు విద్యార్థులకు ముందుగా శ్రీగురు పాదుకా మంత్రోపదేశం చేసి శ్రీగణపతి,బాల, చండీ మంత్రోపదేశాలు చేశారు. నాలుగు రోజుల్లో ప్రాథమిక అంశాలైన మంత్ర సాధన,యంత్ర పూజలు ఆచరణాత్మకంగా నేర్పుకొంటారన్నారు. ఆచార్యులుగా మూర్తి రాధ, కె. రమ,షణ్ముఖ వ్యవహరించారు.

బాలికల సాధికారతకు ఎన్టీపీసీ పెద్దపీట



బాలికల సాంస్కృతిక ప్రదర్శన



బాలికలతో ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ పాండే, ప్రాజెక్ట్ హెడ్ సిన్హా

ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ పాండే

పరవాడ: బాలికలు అన్ని రంగాల్లో రాణించేలా ఎన్టీపీసీ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ పాండే అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బాలిక సాధికారిత మిషన్-2024 ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగాపాల్గొని ప్రసంగించారు. పాండే వివిధ అంశాలపై చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. బాలికల్లో స్ఫూర్తి నింపింది. సంస్థ ప్రాజెక్టు హెడ్ ఎస్.కె.సిన్హా మాట్లాడుతూ బాలిక సాధికారత కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి కృషి చేసిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యాపరమైన ప్రేరణ, వ్యక్తిత్వ వికాసం, సాధికారతను పెంపొందించడానికి రూపొందించిన వివిధ కార్యకలాపాలతో వర్క్‌షాపు నిర్వహించినట్లు చెప్పారు.

మే 10న ప్రారంభమైన బాలిక సాధికారిత వర్క్‌షాపులో సమీప గ్రామాల నుంచి 120 మంది బాలికలు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో బాలికలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ పాండే, సంస్థ ప్రాజెక్టు హెడ్ సిన్హా చేతుల మీదుగా బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రీన్ బెల్ట్ కనుమరుగు

- పచ్చదనం పెంపొందించాల్సిన ప్రాంతాల్లో కట్టడాలు
- పట్టించుకోని అధికారులు

అక్కిరెడ్డిపాలెం: పచ్చదనాన్ని పెంపొందించాల్సిన గ్రీన్ బెల్టులు ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ స్థలాలను ఆక్రమించుకుని కొందరు ఏకంగా బహుళ అంతస్తుల భవనాలే నిర్మించడం స్థానికులను విస్మయానికి గురి చేస్తోంది.

జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెంలోని పలు చోట్ల ఉన్న ప్రభుత్వ ఆస్తులైన గ్రీన్ బెల్ట్‌లు అన్యాక్రాంతమై పోయాయి. ఈ స్థలాలను ఆనుకొని ఉన్న నివాస యజమానులు గ్రీన్ బెల్ట్ స్థలాలను కూడా ఆక్రమించుకుని నివాసాలను విస్తరించుకుంటున్నారు. మరికొందరు ఇదే అదనుగా వ్యాపార సముదాయాలను నిర్మించుకుని వేలల్లో అద్దెల రూపంలో ఆదాయాన్ని పొందుతున్నారు. వీటిని అరికట్టాల్సిన జీవీఎంసీ, టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.



అక్కిరెడ్డిపాలెం ప్రధాన రహదారిలో గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించి నిర్మిస్తున్న గృహ సముదాయం



గ్రామంలో ప్రధాన రోడ్డు పక్కన గ్రీన్ బెల్ట్ ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

గ్రామంలో ఒక బహుళ అంతస్తు నిర్మాణదారుడు ఏకంగా గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించి నిర్మాణాన్ని విస్తరించాడు. అంతేకాకుండా సదరు నిర్మాణదారుడు తమ పరపతిని వినియోగించుకుని గ్రీన్ బెల్ట్ స్థలంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసుకోవడం విశేషం.

గ్రామంలో ప్రధాన రహదారి పక్కన సుమారు కొన్ని వందల మీటర్ల మేర ఉండాల్సిన గ్రీన్ బెల్టుల్లో పలు వ్యాపార సముదాయాలు, నివాసాల విస్తరణ చేపట్టడంతో పచ్చదనం పెంపొందించాల్సిన గ్రీన్‌బెల్ట్‌లు కనుమరుగవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ కట్టడాలను అరికట్టాల్సిన టౌన్‌ప్లానింగ్ విభాగం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఘన చరితకు నిలువెత్తు సాక్ష్యం..

- బీచ్‌రోడ్డులోని హవా మహల్
- వందేళ్లు పైబడినా నేటికీ అదే ఠీవి
- ఎందరో ప్రముఖులకు ఆతిథ్యమిచ్చిన నెలవు

వందేళ్లకు మించిన చరిత్ర ఆ పురాతన కట్టడానిది. అనంత సాగరానికి అభిముఖంగా కాలానికి ఎదురొడ్డి ఠీవిని ప్రదర్శిస్తోంది. రాజుల హయాంలో రూపొంది.. తర్వాతి కాలంలో ఎందరో ప్రముఖులకు ఆతిథ్యమిచ్చింది. అనంతర కాలంలో విశాఖలో రూపొందిన మొట్టమొదటి మహిళా కళాశాలగా మారి ఎంతో మందికి విద్యనందించింది. అదే.. నేటికీ బీచ్ రోడ్డులో మనకు కనిపించే హవా మహల్.



వందేళ్ల కిందట హవా మహల్

దాబాగార్డెన్స్ : విశాఖ బీచ్‌రోడ్డులోని హవా మహల్ ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. పలు సినిమాల్లో సైతం కనిపించిన ఈ కట్టడానికి ఎంతో విశిష్ట చరిత్ర ఉంది. ఒకప్పటి జైపూర్ ఎస్టేట్స్‌లోని కొంత భాగం (ఇప్పటి పాడేరు, అనంతగిరి, అరకు) మద్రాసు ప్రెసిడెన్సీ పరిధిలో ఉండేది. జైపూర్ మహారాజులు రాకపోకలు సాగించేందుకు వీలుగా విశాఖలో గుడారాలు వేసుకుని విడిది చేసేవారు. ఈ నేపథ్యంలో విశాఖలో ఒక విడిది గృహాన్ని నిర్మించాలని అప్పటి మహారాజా రామకృష్ణ దేవ్ సంకల్పించారు. 1913వ సంవత్సరంలో సాలూరు జమీందార్ వద్ద మూడున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. 1917లో నిర్మాణం పూర్తయింది. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అప్పట్లో విశ్రాంతి భవనాలు లేకపోవడంతో అప్పట్లో ఏయూకి వచ్చే అధికారులు, అతిథులు ఈ హవా మహల్‌లోనే బస చేసేవారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ తదితర ప్రముఖులు అప్పట్లో ఇక్కడే బస చేయడం విశేషం. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఆర్మీ హెడ్ క్వార్టర్లను ఈ భవనంలోనే ఏర్పాటు చేశారు. ఇది 1945 వరకు ఇక్కడే కొనసాగింది. జమీందారి విధానం రద్దయిన తర్వాత ప్రభుత్వం నామమాత్రపు అద్దెపై హవా మహల్‌లో నర్సింగ్ స్కూల్ ఏర్పాటు చేసింది. 1980 నాటికి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళ్రావు హయాంలో జైపూర్ మహారాజా అనుమతితో విశాఖ ఉమెన్స్ కళాశాలను ఏర్పాటు చేశారు. 1991లో కళాశాలను సౌత్ జైల్ రోడ్డుకు మార్చారు.



చెక్కుచెదరని హవా మహల్


అద్భుత రాతి కట్టడం..

రాజుల కోటను తలపించే ఈ భవనం రెండంతస్తుల రాతి కట్టడం. దీనిని రెండు భాగాలుగా నిర్మించారు. రోడ్డుపై నుంచి కనిపించేది ప్రధాన భవనం. వెనుక నున్నది కిచెన్ కాంప్లెక్స్. రెండు కట్టడాలకు ఒకే పై కప్పు నిర్మించారు. భవనం మధ్యలో వృత్తాకారంలో ఆర్చిలు, కట్టడానికి ఇరువైపులా సంప్రదాయబద్ధంగా సిమెంట్ కలశాలు నిర్మించారు. హవా మహల్ ముందు, వెనుక భాగాల్లో అర్ధ వృత్తాకారంలో వరండాలు, ఉత్తర, దక్షిణాల్లో రూఫ్ వరండాలు ఉన్నాయి. పై అంతస్తుకు చేరుకునేందుకు గుండ్రటి ఇనుప మెట్లను ఏర్పాటు చేశారు. భవనం వెనుక సర్వెంట్, వాచ్‌మెన్‌లు ఉండేలా నిర్మించారు.

మొదటి ప్రధాని నెహ్రూ, రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌లకు ఆతిథ్యం..

నాటి ఎంతో మంది గవర్నర్లు, రాజకీయ ప్రముఖులకు ఆతిథ్యం ఇచ్చిన హవా మహల్ మన దేశపు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు కూడా ఆతిథ్యం ఇచ్చింది. 1961లో హిందుస్తాన్ షిప్‌యార్డు మొట్టమొదటి సారిగా రూపొందించిన జల ఉష నౌకను సాగర ప్రవేశం చేయించేందుకు విశాఖ విచ్చేసిన నెహ్రూ హవా మహల్‌లోనే బస చేశారు. అలాగే మన దేశ మొట్టమొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ విశాఖ విచ్చేసిన సందర్భంగా ఆయన కూడా హవా మహల్‌లోనే బస చేయటం అపూర్వమని చెప్పాలి.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు